క్లుప్తంగా

విజేత మండ్లవానిపల్లె భజన బృందం



మండ్లవానిపల్లె భజన బృందానికి మొదటి బహుమతి అందజేస్తున్న గ్రామ పెద్దలు

ఆస్పరి: మండలంలోని ములుగుందంలో వెలసిన శ్రీశైలం తాత ఆరాధనోత్సవాలు సందర్భంగా శుక్రవారం రాత్రి రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించారు. మండ్లవాని పల్లె భజన బృందం విజేతగా నిలిచి 6 గ్రాములు బంగారు కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో ఉయ్యాలవాడ(5 గ్రాములు), మూడవ స్థానంలో కడమకుంట్ల, గుత్తి ఆర్ ఉమ్మడిగా(4 గ్రాములు బంగారం, 22 తులాలు వెండి) నిలిచాయి. విజేతలకు శనివారం గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు.

శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలి



ఈఓపీఆర్డీకి వినతి పత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

హాలహర్వి: మండలంలోని రిజర్వాయర్ల ద్వారా గ్రామాలకు సరఫరా అవుతున్న నీటిని శుద్ధి చేసిన తర్వాతే సరఫరా చేయాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చంద్ర, ఉపాధ్యక్షులు మల్లికార్జున అధికారులను కోరారు. శనివారం వారు ఈఓపీఆర్డీ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు. బాపురం, చింతకుంట రిజర్వాయర్ తాగునీటి పంప్‌హౌస్ నుంచి సుమారు 45 గ్రామాలకు శుద్ధి చేయకుండా నీటిని సరఫరా చేస్తుండటంతో ప్రజలు విషజ్వరాలబారిన పడుతున్నారని వారు వివరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శీను, తిమ్మప్ప, బసవరాజు, పవన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

హొళగుంద: మండల పరిధిలోని మార్లమడికి, హొళగుంద గ్రామాలకు చెందిన ఒంటరి వృద్ధులు, దివ్యాంగులకు శనివారం ఆదోని వివేకానంద సేవా సంస్థ, భారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సంస్థల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్, సిద్దార్థగౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకం

దేవనకొండ: ఉపాధి హామీ పథకం కింద వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నట్లు ఏపీడీ పక్కీరప్ప తెలిపారు. శనివారం మండలంలోని తెర్నెకల్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో హార్టికల్చర్ పెంపకంపై రైతులకు సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ హార్టికల్చర్ వల్ల రైతులు ఆర్థికంగా ఎదగడానికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. పర్యావరణాన్ని రక్షించడానికి హార్టికల్చర్ దోహదం చేస్తుందన్నారు. సమావేశంలో ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిసెట్లు, టీసీఏ, పీఎస్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

చిప్పగిరి: స్థానిక పశువైద్యశాలలో పశువైద్యులు శనివారం పలు పశువులకు ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకా వేశారు. పశువులకు తప్పనిసరిగా టీకా వేయించాలని పశువైద్యులు ప్రసన్నబాయి రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆఫీస్ సబార్డినేట్ నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా శ్యాంప్రసాద్‌ముఖర్జి జయంతి

పత్తికొండ రూరల్: బీజేపీ మూల పురుషుడు డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జి జయంతిని పత్తికొండలో శనివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శ్యాంప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శంకరయ్యాచారి, సీసీ రంగన్న, రామ్మోహన్, దండి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి



పంచాయితీ కార్యాలయానికి వచ్చిన కాలనీవాసులు

మద్దికెర: స్థానిక రాంనగర్‌లో పది రోజులుగా కుళాయిలకు నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు లక్ష్మీదేవి, రామాంజులు, శ్రీనివాసులు తెలిపారు. శనివారం వారు పంచాయతీ కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతిపత్రం అందించి, సమస్యను విన్నవించారు. సక్రమంగా నీరు సరఫరా చేయకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లి తెతచ్చుకోవాల్సి వస్తుందని పలువురు మహిళలు వాపోయారు. అధికారులు స్పందించి నీటిని సరఫరా చేయాలని కోరారు.

నకిలీలతో జాగ్రత్త!

- రసాయన మందుల కొనుగోలులో అవగాహన తప్పనిసరి
- అన్నదాతలకు వ్యవసాయధి అధికారుల సూచన



గత నెలలో వెల్దుర్తిలోని ఓ ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కృష్ణగిరి: పైర్లు ఏపుగా పెరిగి అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో అన్నదాత రసాయన మందులను ఎక్కువగా వాడుతున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు వ్యాపారులు నకిలీ మందులను అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అలాంటి మందుల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని అన్నదాతలకు వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అనుమతులున్న డీలర్ల వద్దే మందులు కొనుగోలు చేయాలని, మందులు కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా రసీదు తీసుకోవాలని సూచిస్తున్నారు. లేదంటే నష్టపోయే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

దళారుల వద్ద కొనుగోలు చేయొద్దు

నిషేధిత పురుగు మందులు కొనుగోలు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు, విజిలెన్స్ అధికారులు సూచిస్తున్నారు. ఎరువుల వ్యాపారులు వారి బిజినెస్ బాగా జరగాలని రైతులకు పంట దిగుబడి అధికంగా వస్తోందని నమ్మించి, అనుమతి లేని వివిధ కంపెనీల కల్తీ ఎరువులు, పురుగు మందులు రైతులకు అంటగట్టే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అనుమతులు లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయరాదన్నారు. తక్కువ ధరకే మందులు విక్రయిస్తారని, వాటిని కొనుగోలు చేసి వాడితే పంట దిగుబడి తగ్గడంతోపాటు భూసారం దెబ్బతింటోందన్నారు. మందులు కొనుగోలు చేసేటప్పుడు మందుల లేబుళ్లను మొదట పరిశీలించి, అవి కంపెనీ ఎరువులా లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా అన్న విషయాలను రైతులు తెలుసుకోవాలి. అవసరమైనప్పుడు ఎరువులు, పురుగులు మందులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి.

నకిలీ అని తెలిస్తే ఫిర్యాదు చేయండి

గ్రామాల్లో ఎవరైనా దుకాణాలు పెట్టి లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి. మందుల లాట్ నంబర్‌ను బట్టి తయారు చేసిన తేదీనీ గుర్తించి ఏ కంపెనీ, ఏ రకం వంటి విషయాలను చూడాలి. దుకాణం యజమాని సంతకంతో కూడిన బిల్లులను తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా విత్తనాలకు సంబంధించిన సంచులపై సీలు తొలగించినట్లు గుర్తిస్తే వాటిని కొనుగోలు చేయకుండా నకిలీలపై రైతులు సత్వరమే ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో అది వాస్తవమని తేలితే సంబంధిత డీలర్‌పై కేసులు నమోదు చేసి రైతులకు న్యాయం జరగడానికి అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

లైసెన్స్‌లు రద్దు చేస్తాం



ఎరువుల దుకాణాల్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తమ పరిశీలనలో గుర్తిస్తే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తాం. మందులు కొనుగోలు చేసిన రైతులకు దుకాణ పేరుతోపాటు యజమాని సంతకంతో కూడిన బిల్లు తప్పక ఇవ్వాలి. పురుగు మందులు తీసుకునేటప్పుడు డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. చదువురాని వారు తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీదో నిర్ధారించిన తర్వాతనే కొనుగోలు చేయాలి. డబ్బాపై చూపించిన ప్రకారంమే మందు పిచికారీ చేయాలి లేకుంటే పంట దెబ్బతినే అవకాశం ఉంటుంది. రైతులు ఈ విషయాలు తెలుసుకుని మందు కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎస్. వెంకటేశ్వర్లు, ఏఓ, కృష్ణగిరి

అంజన్నకు అభిషేక పూజలు

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించుకున్నారు. కౌతాళంతోపాటు అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి బుడుములదొడ్డి ఆంజనేయస్వామి, ఎరిగేరి పులిగట్టు ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం తదితర పూజలు చేపట్టారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో చోరీ?

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టిలో వెలిసిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయలో శనివారం గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్వామి వారి హుండీని పగలగొట్టి రూ.4 వేల నగదును అపహరించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

దేవనకొండ: మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసారావు శనివారం విద్యుత్ ఏఈ, పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సి.కృష్ణ, నల్లచెలిమల శాఖ కార్యదర్శి బజారి, ప్రజాసంఘాల నాయకులు రాఘవేంద్ర, సుల్తాన్, బాషా, కోమేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ ఆదినారాయణ. చిత్రంలో ఎంపీడీఓ నరేంద్రకుమార్

ఆలూరు: జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈ ఆదినారాయణ అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీఓ నరేంద్రకుమార్‌తో కలిసి ఆయన శనివారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, ఉపాధిహామీ పథకం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా హౌసింగ్ డీఈ మాట్లాడుతూ పలు గ్రామాల్లో గృహాలు లేని లబ్ధిదారులకు ఆలూరు సబ్‌డివిజన్ పరిధిలో 96 లేఅవుట్లలో 4,817 మందికి గృహాలను మంజూరు అయ్యాయన్నారు. అందులో ఇప్పటివరకు 2,016 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగతా 2,561 గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయన్నారు. వీటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో భాగంగా వివిధ గ్రామాలకు చెందిన ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాసులు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలన ఎంతో కాలం సాగదు

- ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి



బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ

చిప్పగిరి: అరాచక పాలన ఎంతో కాలం సాగదని, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. గత నెల 14న టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన దౌల్తాపురం గ్రామానికి చెందిన మేకల శేకన్నను శనివారం దౌల్తాపురంలో తన నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని, టీడీపీ బెదిరింపులకు భయపడకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం బాధితుడికి రూ.50,000 ఆర్థిక సాయం అందించారు. అనంతరం గ్రామంలో పర్యటించి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. ఉన్నన్ని రోజులు పాలకులు ప్రజలకు మేలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, ప్రతిపక్ష పార్టీ శ్రేణులపై దాడులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దాడులను ఖండించకపోవడం బాధాకరమన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు మారయ్య, నాగప్ప, మల్లికార్జున, పెద్ద పెద్దయ్య, లోక్‌నాథ్, చిన్న శేఖన్న, దామోదర్, వెంకటేష్ ఉన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి



కంబాలపాడు పశువైద్యశాలలో పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: ఇంట్లో పెంచుకునే జంతువులకు కూడా క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలని పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. మండల పరిధిలోని కంబాలపాడు పశువైద్యశాలలో శనివారం ఆయన కుక్కలను టీకాలు వేశారు. జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సోకుతాయని, వీటిని జునోసిస్ వ్యాధులు అంటారని, అన్ని రకాల జంతువుల నుంచి ఈ వ్యాధులు సోకే ప్రమాదం ఉండటంతో వ్యాక్సిన్ వేసుకోవాలని ఆయన సూచించారు. కుక్క కాటుకు సంబంధించిన వ్యాక్సిన్ అన్ని ఆస్పత్రుల్లో అందుబాటులో ఉందన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

మద్దికెర: ప్రజలు నిత్యం ప్లాస్టిక్ వినియోగించడం వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయని వాటిని నివారించడానికి ప్రతిఒక్కరూ నడుంబిగించాలని భారత్ గ్యాస్ నిర్వాహకులు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. శనివారం స్థానిక ఫ్రెండ్స్ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే అనర్థాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు పాల్గొన్నారు.

చిప్పగిరిలో సంపూర్ణత అభియాన్



మాట్లాడుతున్న నీతి ఆయోగ్ కన్సల్టెంట్ స్మృతిసబర్వాల్

చిప్పగిరి: కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ వారు అమలు చేస్తున్న ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జెడ్పీహెచ్ హైస్కూల్‌లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం, పోషకాహారం, వ్యసాయ రంగం, సామాజిక అభివృద్ధి వంటి అంశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ కన్సల్టెంట్ స్మృతిసబర్వాల్, సీపీఓ ప్రభాకర్, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, పీడీ డీఆర్‌డీఓ సలీమ్‌బాషా, ఎంపీపీ జూటూరు హేమలత, ఎంపీడీఓ బరెన్ సాహెబ్ పాల్గొన్నారు.

అడ్డొస్తున్నాయని నరికేశారు!



వనమహోత్సవాల పేరుతో ప్రత్యేక నిధులు వెచ్చించి ఇరువైపులా మొక్కలు నాటే అధికారులు.. ఓ కాంట్రాక్టర్ ఏకంగా 30 చెట్లను నరికేసినా పట్టించుకోకపోవడం సిగ్గుచేటు. వాహనాలొదిలిన వాయుకాలుష్యాన్ని తమలో ఇమిడ్చుకుని ప్రయాణికులకు ప్రాణవాయువునందిస్తూ రోడ్లకిరువైపులా గంభీరంగా ఉన్న పచ్చని చెట్ల తలలను తెగ నరుకుతున్నా ఏ అధికారి కూడా పల్లెత్తు మాట అనకపోవడం దారుణం. విద్యుత్ శాఖ అధికారులు మద్దికెర నుంచి ఎడవలి గ్రామం వరకు 33 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుకు ఉపక్రమించారు. అందులో భాగంగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఎం.అగ్రహారం అడ్డ రోడ్డు వరకు ఉన్న పచ్చని చెట్లను ఇష్టానుసారంగా నరికేయించాడు. రోజా చల్లటి నీడలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో అటుగా ప్రయాణించే ప్రయాణికులు ఈ దృశ్యాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కలు పెంచి పెద్దచేయాలని ఉపన్యాసాలిచ్చే అధికారులు ఎక్కడ దాక్కున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

– మద్దికెర

రేపు వైఎస్సార్ జయంతి

దేవనకొండ: ఈనెల 8న దివంగత నేత వైఎస్‌ఆర్ జయంతిని నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తపాల శ్రీను తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ వైఎస్ ఆర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయనున్నట్ల చెప్పారు.

కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం

హొళగుంద: ఈనెల 8న ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా శనివారం తెలిపారు.

రుణాలను రికవరీ చేయాలి

ఆలూరు: పొదుపు సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా పొందిన రుణాలను తిరిగి చెల్లిస్తే కొత్త రుణాలను మంజూరు చేస్తామని ఏపీఎం ఆంజనేయులు సూచించారు. వివిధ గ్రామాల్లో శనివారం సీసీలు గ్రామ, మండల సమైక్య సంఘం గ్రూపు సభ్యుల సమావేశాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీఎం ఆంజనేయులు మాట్లాడుతూ రుణాల రికవరీకి సీసీలు, మండల, గ్రామ మహిళా పొదుపు సంఘాల లీడర్లు కృషి చేయాలని సూచించారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి



వెల్దుర్తిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ఉప ప్రధాని, సంఘ సంస్కర్త డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం వెల్దుర్తి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయనకు నివాళులర్పించారు. సమితి సీనియర్ నాయకులు నాయకంటి గిడ్డయ్య మాదిగ, ఎం బజారు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బజయ్య ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి నాయకులు బజారు, మోష, నాగరాజు, సూరిబాబు, పరమేశ్, వెంకట్రాముడు, బోయనపల్లె వెంకటేశ్వర్లు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అబ్దుల్లా

ఆలూరు: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా అబ్దుల్లా మాట్లాడుతూ విద్యారంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాలకు ప్రభుత్వమే తూట్లు పొడుస్తోందన్నారు. డిజిటల్ క్లాసుల పేరుతో ఉపాధ్యాయుల పోస్టులను తగ్గించడం సరికాదన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆలూరు మండల అధ్యక్షుడిగా హనుమంతు, కార్యదర్శులుగా కృష్ణ, కిరణ్ తోపాటు 15 మందిని ఈసీలుగా ఎన్నుకున్నారు.

సంఘాల అభివృద్ధిలో రైతులు భాగస్వాములు కావాలి




జొన్నగిరిలో సహకార బ్యాంకు జెండా ఆవిష్కరిస్తున్న సీఈఓ గిడ్డయ్య

తుగ్గలి: సహకార సంఘాల అభివృద్ధిలో రైతులు భాగస్వాములు కావాలని ఉప్పర్లపల్లి, మారెళ్ల సహకార బ్యాంకుల సీఈఓలు గిడ్డయ్య, మనోహర నాయుడు సూచించారు. శనివారం ఆయా సంఘాల కార్యాలయాల్లో సహకార బ్యాంకు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సహకార బ్యాంకుల ఆవిర్భావం, విశిష్టత, సహకార సూత్రాలు, సహకారం రంగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, సహకార బ్యాంకుల ద్వారా రైతులు, ఇతర వర్గాలకు అందిస్తున్న బ్యాంకింగ్ సేవలు రుణాలపై వారు రైతులకు వివరించారు. సంఘాలు అందిస్తున్న అన్ని రకాల సేవలను రైతులు సద్వినియోగం చేసు కోవాలన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సకాంలో చెల్లించి బ్యాంకుల అభివృద్ధికి రైతులు పాటుపడాలని కోరారు.

హొళగుంద: స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో సంఘం జెండా ఆవిష్కరించారు. సహకార సంఘాల బలోపేతంతోనే దేశాభివృద్ధి సాధ్యమని సింగిల్ విండో కార్యాలయ సెక్రటరీ నీలకంఠస్వామి అన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

హొళగుంద: ఫర్టిలైజర్ షాపుల్లో శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హనుమంతరావు, చంద్రశేఖర్‌రెడ్డి తనిఖీలు చేపట్టారు. బిల్ బుక్స్, రికార్డులు సక్రమంగా లేని న్యూ ఈరలింగేశ్వరస్వామి ఫర్టిలైజర్ షాపులోని రూ.3,00,754 విలువ చేసే పురుగు మందులు, రూ.16,550 విలువ చేసే ఎరువుల విక్రయాలను నిలిపేశారు. అలాగే స్టాక్ రికార్డు సరిగా లేని శ్రీ ప్రసన్న ఆంజనేయ విత్తనాల దుకాణాలోని రూ.1,15,776 విలువ చేసే విత్తనాల అమ్మకాలను నిలిపేశారు. వారి వెంట ఏఓ ఆనంద్‌లోకదళ్ ఉన్నారు.